# మురుగనాయుగం




సి. హెచ్.వి. బృందావనరావు

"రేపూ ఎల్లుండీ నా ఆటో రాదు అమ్మగారూ. మన పిల్లల్ని మీరే వేరే ఆటోలో స్కూలు దగ్గర దించండి" అన్నాడు సత్యం.

"ఎక్కడికి పోతున్నావేమిటి?" అడిగాను.

"రెండ్రోజులు వూళ్లో ఉంటంలేదమ్మగారూ. మా వూరికి పోయి రావాలి" అన్నాడు.

సత్యం ఆటోవాలా. మా పిల్లల్ని, ఇంకా మా ఇంటి పక్కనుండే రెండుమూడిండ్ల పిల్లల్ని తన ఆటోలో ఉదయమే స్కూలుకు తీసుకెళతాడు. తిరిగి సాయంత్రం ఆరింటికి భద్రంగా ఇంటిదగ్గర దింపుతాడు. ఈ మధ్యలో తన బేరాలు చూసుకుంటాడు సిటీలో. ఒక సంవత్సరం నుంచీ జాగ్రత్తగా పిల్లల్ని స్కూలుకూ స్కూలునించి ఇంటికీ తీసుకొస్తున్నాడు. ఏడాదిగా పరిచయమైనాడు. మనిషి నమ్మకస్తుడు.

"ఈరెండ్రోజులకూ నువ్వే మరో ఆటోను మాట్లాడకపోయినావా" అన్నాను.

"ఎందుకమ్మా. స్కూలు పెద్ద దూరం లేదు గదా. అంతేకాక కావలసినన్ని ఆటోలు ఎప్పుడు కావాలంటే అప్పుడు దొరుకు తాయాయె." అన్నాడు.

నిజమే. ఈరెండు రోజులు నేనే పోయి స్కూలు దగ్గర దించొస్తే సరి, లేకపోతే పిల్లల్ని వాండ్ల నాన్నే స్కూటర్‌మీద డ్రాప్ చేసి వస్తాడు. ఒకట్రెండు రోజులు సత్యానికైనా ఏదో పని వుంటుంది గదా పాపం.

రాత్రి సారధికి చెప్పాను. రేపు ఆటో రాదు, నువ్వే పిల్లల్ని స్కూలు దగ్గర డ్రాపు చెయ్యాలని.

"రోజూ వచ్చే ఆటో కేమయింది?" అడిగాడు సారధి. సత్యం చెప్పిన సంగతులన్నీ వివరించాను.

"సర్లే" అన్నాడు.

మర్నాడు పొద్దున్నే ఇద్దరు పిల్లల్ని స్కూటర్‌మీద ఎక్కించుకొని స్కూల్లో దించి వచ్చాడు సారధి. తర్వాత తన పన్లు ముగించు కొని హడావుడిగా ఆఫీసుకు వెళుతూ "సాయం కాలం మాత్రం నీవే పిల్లల్ని ఇంటికి తీసుకురా. నాకు ఆఫీసులో లేటయితే కష్టం గదా"అన్నాడు.

"సరేలే" అన్నాను.

పిల్లల్ని పొద్దున్నే లేపి, వాండ్ల కార్య క్రమాలు పూర్తి చేయించి, స్కూలుకు తయారు చేసే సరికి నా ఓపిక దాదాపు హరించి పోతుంది. ఆ తర్వాత సారధికి లంచ్ బాక్సు తయారుచేసి సాగనంపేసరికి బాగా అలసట వచ్చేస్తుంది. ఇంక ఆతర్వాత నే నాస్వంత పను లంటూ ఏముంటాయ్ గనక.స్నానం ముగించు కొని, పిల్లల గుడ్డలుతికించి, ఇల్లు తుడిపించి కొంచెం సేపు పేపరు తిరగవేసి – సరే ఇవ్వన్నీ చిన్న చిన్న పనులైనా పొద్దుట్నించీ సాయం కాలందాకా ఏదో ఒకటి చేస్తూనే వుండాలిగదా.

సారధి ఆఫీసుకు పోగానే స్నానం అదీ చేసి కొంచెం ఫ్రెషప్ అయి విశ్రాంతిగా సోఫాలో కూర్చుని పేపరు చేతిలోకి తీసు కున్నాను. టి.వి. ఆన్ చేశాను. ఏదో ఛానల్లో పాతసినిమా పాటలు వస్తున్నాయి. ఓ పడుపు కళ్ళ తార నవ్వో ఏడుపో తెలీని ఎక్స్‌ప్రెషను మొహం మీద పులుముకుని, అంట్లు తోముతూ

## జ్ఞాపకాలు

జ్ఞాపకాలు ! జ్ఞాపకాలు !
మధురమైన, మంజులమైన
మదిగదిలో కొలువై వున్న
వ్యాపకాలు, జ్ఞాపకాలు !

కన్నుల్లో తళుకులు
పెదవులపై చిరునగవు
కదలికలో, కనుగవలో
కదలును సప్తస్వరాలు !

గుండెలో గుబులు పుట్టించే
గమ్మత్తైన గమకాలు !
మదిని మండించే అగ్ని
జ్వాల వంటి జ్ఞాపకాలు !

జడిలో, అలజడిలో
పడి లేచే తరంగాలు !
ఏకాంతంలో మేమున్నామని
పలకరించే నెచ్చెలులు !

స్మృతి పథాన్ని వీడిపోక
సదా పలకరిస్తూ నిలిచిపోయి
సందడి చేస్తున్న సుందర
సుధాంశువులు !

**– వల్లూరుపల్లి లక్ష్మి**

"ఆడబ్రతుకే మధురం" అంటూ పాడుతున్నది. ఏమిటి, అంట్లు తోమడం, ఇల్లు అలకడం, పిల్లల ఒళ్లు కడగడం – ఈ బ్రతుకే నా నువ్వు మధురం అంటూ పాడుతున్నావు – అని ఆ తారను చెవి పట్టుకొని టీవీలోంచి ఇవతలికి లాక్కొచ్చి ఒక మొట్టు మొట్టుదామనిపించింది.

"నీవన్నీ ఇలాంటి అఘాయిత్యం ఆలోచనలే." అంటుంటాడు సారధి. నాకు ఇంకా చిర్రెత్తుకొస్తుంటుంది.

టీవీ కట్టేసి పేపరు తిరగేస్తుంటే కనిపించింది ఆ వార్త. " హైదరాబాదు అమీరు పేటలో స్కూలువద్దనుంచి ఇద్దరు పిల్లల్ని ఎత్తుకెళ్ళిన దుండగులు." చదవగానే నాకు భయంతో కూడిన ఆసక్తి ఎక్కువైంది. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇలాంటి సంఘటనలే కన్పిస్తు న్నాయి. స్కూలు వదిలింతర్వాత తండ్రి కోసం ఎదురుచూస్తున్న పిల్లలను మాటల్తో మభ్యపెట్టి ఇద్దరు యువకులు ఆటోలో ఎక్కించుకుని తీసుకు పోయారట.పిల్లలకోసం తల్లిదండ్రులు హృదయ విదారకంగా ఏడుస్తున్నారు. పోలీసు రిపోర్టు కూడ ఇచ్చారట.పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారట. ఇదీ ఆ వార్తవివరాలు. ఇద్దరూ ఆడపిల్లలట.ఆడపిల్లల్ని అపహరించి బొంబాయి లో అమ్మే ముఠాలు పెద్దపెద్ద సిటీల్లో చురుగ్గా తమ కార్యకలాపాలు కొన సాగిస్తున్నాయట.

అది చూడగానే నాకు గాబరా వేసింది. నా పిల్లలిద్దరూ కిరణ్, సవితా కళ్లల్లో మెదిలారు. ఎప్పుడెప్పుడు సాయంకాలమవుతుందా ఎప్పుడు పోయి పిల్లల్ని తీసుకువద్దామా అనే ఆదుర్దా ఎక్కువయింది.కాఫీ కలుపుకు తాగే టైమయ్యింది గాని తాగబుద్దెయ్యలేదు.

సత్యం అయితే పరిచయమైనవాడు. భయం లేకుండా పిల్లల్ని ఇంటికి తీసుకు వస్తాడు. సరిగ్గా స్కూలు వదిలేసరికి అక్కడుం టాడు. పిల్లల్ని జాగ్రత్తగా ఎక్కించుకొని ఇంటికి చేరుస్తాడు.

ఈవార్త చదివింతర్వాత నాకు ఒకటే ఆలోచన ఎప్పుడైనా స్కూలు వదిలేసరికి అతని ఆటో చేరలేకపోతేనో, ఏ ట్రాఫిక్‌జామ్‌లోనో చిక్కుకుని సకాలంలో రాలేకపోతేనో, పిల్లలు అతని కోసం చూసీ చూసీ ఎవరినో నమ్మి ఎక్కడికైనా వెళ్ళిపోతేనో – ఇలా రకరకాలైన ఆలోచనలు మనసంతా ముసురుకొని భయం పుట్టిస్తున్నాయి.

సాయంకాలం అయిదుంబావయింది. ఇంటికి తాళం వేసి బయల్దేరాను. ఆటో వెంటనే దొరకలేదు. కొంచెంసేపు వేచి వుండాల్సి వచ్చింది. ఆటో ఎక్కి స్కూలు దగ్గరికి వెళ్లేసరికి అప్పటికే స్కూలు వదిలేశారు. చాలామంది పిల్లల్ని వాళ్ల ఆటోలో, రిక్షాలో ఎక్కించుకొని

వెళ్ళిపోయాయి. ఇంకా నాలుగైదు ఆటోలు పిల్లలకోసం ఆగివున్నాయి. కిరణూ సవితా బయట నిలబడి వున్నారు. వాళ్ళిద్దరితో ఎవరో ఒక వ్యక్తి మాట్లాడుతున్నాడు. ఎవరో కొత్తవ్యక్తి. నేనెప్పుడూ ఆ స్కూలుదగ్గర చూళ్లేదు. అక్కడ ఎందుకున్నాడో తెలియదు. ముప్పై, ముప్పై అయిదేండ్ల వయసుండవచ్చు. కొద్దిగా గడ్డం పెరిగి వుంది. కళ్ళు కొంచెం ఎర్రగా వున్నాయి.

'చిన్నా' అంటూ పిల్లల్ని పిలిచాను. నన్ను చూడగానే అమ్మా అంటూ దగ్గరికొచ్చి నన్ను చుట్టుకున్నారు. చాక్లెట్లు నముల్తున్నారు.

"చాక్లెట్లెక్కడివే" అనడిగాను.

"అదుగో, ఆ అంకులిచ్చాడు" అని అతన్ని చూపించారు.

"ఎవరంటే వాళ్లిచ్చినవి తీసుకో కూడ దమ్మా" అని అంటూ అతని వైపు చూశాను. "పిల్లలకెప్పుడూ ఏమీ ఇవ్వొద్దు"అన్నాను కరుగ్గా.

నా మాటలకు అతను బాధపడ్డట్టు న్నాడు.ఎవరు బాధపడితే నాకేం.మన జాగ్రత్తలో మనం ఉండాలిగదా. అసలు ఇలాంటివాళ్లను నమ్మగూడదు. చాక్లెట్లిచ్చి పిల్లల్ని మచ్చిక చేసు కుంటారు. అసలెవరితను. ఎప్పుడూ స్కూలు దగ్గర చూడలేదే.

"ఎవర్నువ్వు" అడిగాను.

"మా వీడు ఇక్కడే అమ్మణ్ణీ. నాందా ఆ కనిపించే షాపులో పనిచేస్తును" అని చెయ్యెత్తి ఏదో షాపును చూపించాడు.

"మీరు అరవ్వాళ్లా"

"ఆమ"

నాకు అనుమానం ఇంకా ఎక్కువైంది అతనిమీద.

"పిల్లల్తో ఏం పని" అన్నాను కోపంగా.

''ఏం లేదమ్మణ్ణీ. ఈ స్కూల్లో వుండున్న అయ్యవారు నాకు ఫ్రెండ్. ఆయన కోసం వస్తే, ఈ చిన్న పొణ్ణులను జూసి ముచ్చ టేస్తే మాట్టాడుతుండాను" అన్నాడు.

అతను మాట్లాడుతున్నాడు గాని అతని ముఖం మామూలుగా లేదు. ఏదో బాధగా జాలిగా వున్నాడు. ఇలాంటి వాళ్లను అసలే నమ్మకూడదు. ఏమో,ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు. పిల్లల్ని రెండు చేతుల్తో దగ్గరికి అదుముకున్నాను.

"పదండి పోదాం" అన్నాను.

"బై అంకుల్" అని పిల్లలు అతనికి చెయ్యూపారు. "బై" అని చెయ్యూపుతూ అతను పిల్లల్నే చూస్తున్నాడు. నాకు అతని వాలకం చూస్తే అనుమానం బలపడుతున్నది.


ఎట్లా చెయ్యాల్నోదా !

"మీరు కొత్తవాళ్లతో మాట్లాడ కూడ దమ్మా" పిల్లలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశాను.

"ఏమ్మా, ఆ అంకుల్ మంచివాడు. బాగా మాట్లాడ్తాడు. ఎన్నో ముచ్చట్లు చెప్పాడు. నువ్వొచ్చే ముందు కిరణ్‌నుఎత్తు కున్నాడు గూడా"అంది సవిత.

నాకు భయంపెరిగి పోతున్నది. ఈ పిల్లలేమో అమాయకులు- అతనిలాంటి వ్యక్తులు ఇలానే ముందు పిల్లలను మచ్చిక చేసు కుంటారు.ఇలాంటి వాళ్ళను పోలీసులకు పట్టిస్తే తప్ప లాభం లేదు. రేపు హెడ్మాస్టర్ తో ఈ విష యం మాట్లా డాలి.

ఆ రాత్రంతా నాకు కలత నిద్రగానే గడిచి పోయింది.సారధి తో గూడ ఈ విషయం చెప్పానుగాని నీవన్నీ అనవసరమైన అనుమానాలు అని కొట్టి పారేశాడు. ఈ పెద్దమనిషి ఏ విషయం మనసులోకి ఎక్కించు కున్నాడు గనక.




పేపర్లో ఆ వార్తా, ఇవ్వాళ స్కూల్‌దగ్గర ఆ కొత్తమనిషీ, అతని వాలకమూ నాకు ఏమాత్రం శాంతి లేకుండా చేశాయి.

మర్నాడు పొద్దున్నే నిద్ర లేవడం కొంచెం ఆలస్యమయింది. పిల్లల్ని గబగబా రెడీచేసి వాళ్ళ లంచిబాక్సులు సర్ది, యూని ఫారాలు వేసి వాళ్ల నాన్నకు అప్పగించాను. "బాయ్ మమ్మీ" అంటూ ఇద్దరూ బయలు దేరారు.

''చిన్నా, జాగ్రత్త. కొత్తవాళ్లతో చనువుగా మాట్లాడకండి" అని హెచ్చరించాను.

సరే, ఇంక నా మామూలు కార్య క్రమాలు.సారధిని ఆఫీసుకు పంపడం, ఆ మీద ఇంటిపనులు, వంటపనులు, లాండ్రీ పనులు అన్నీయధావిధిగా పూర్తయ్యేసరికి భోజనం టైం అయింది.

నా మనసులో ఆదుర్దా మాత్రం పోలేదు. అసలు నేను అవివేకంగా ఎక్కువగా ఊహించుకుంటున్నానా. ఏదో పేపర్లో ఓ వార్త చదవగానే దాన్ని నాకే అన్వయించుకుని పిల్లలకేదో అవుతుందని ఏదేదో ఊహించు కోవడం ఏమిటి అని మనస్సును సమాధాన పరుచుకోవాలని ప్రయత్నించాను గాని నా కళ్ళకు ఆ గడ్డపు అరవవ్యక్తి కిరణ్‌తో మాట్లాడు తున్న దృశ్యమే కనిపిస్తూ నా ఆందోళనను ఎక్కువ చేస్తున్నది. సరే, నిన్న ఏదో అలా జరి గిందిగాని,పిల్లలు క్షేమంగానేఇంటికి వచ్చారుగా అని నన్ను నేనే సముదాయించుకున్నాను.

అయిదయింది. ఇంటికి తాళం వేసి బయల్దేరాను. ఆటో దొరకడం ఆలస్యం అయింది. స్కూలుకు చేరే సరికి నిన్నటి సమయమే అయింది. కిరణ్ సవితా బయట నిలబడి ఉన్నారు. మళ్ళీ ఈరోజు కూడా ఆ గడ్డం వ్యక్తి పిల్లల్తో ముచ్చట్లాడుతున్నాడు. నాకు కోపం పేట్రేగిపోయింది. నన్ను చూసి ఆ వ్యక్తి ముఖం ముడుచుకొని కొంచెం వెనక్కి తగ్గాడు. నాకు అతనిమీద అనుమానం ఇంకా బల

పడింది. ఇంక లాభం లేదు. హెడ్మాస్టరుకు ఇతని వాలకం వివరించి ఇతనిపై చర్య తీసుకోమని చెప్పాల్సిందే. తన ఛాంబర్లో కూచొని పిల్లల సంగతి పట్టించుకోకపోతే ఎలా? పిల్లల సంరక్షన కూడా స్కూల్లో ఉన్నంత సేపూ అతని బాధ్యతే గదా. స్కూలుకు ఎదురుగానే ఏం జరుగుతుందో గమనించుకోకపోతే ఎలా. విసురుగా హెడ్మాస్టరు గదిలోకి పోయాను.

"రండిమేడమ్. ఇవ్వాళ మీరొచ్చారేం?" అన్నారు హెడ్మాస్టరుగారు.

"రెగ్యులర్‌గా వచ్చే ఆటో రాలేదు. నేనే పిల్లల్ని స్కూలుకూ ఇంటికీ తీసుకెళుతున్నాను - సరేగాని సర్, పిల్లల్తో ఏ మనుషులు మాట్లాడుతున్నారో, వాళ్లెలాంటివాళ్లో స్కూలు వదలగానే జాగ్రత్తగా పిల్లలు ఇంటికే బయలుదేరుతున్నారో, ఎవరైనా వాళ్లను మభ్యపెడుతున్నారో ఇవన్నీ మీరు గమనించకపోతే ఎలాగండీ." అన్నాను.

హెడ్మాస్టరుగారి గదిలో ఇద్దరు ముగ్గురు టీచర్లున్నారు. ఇంటికి వెళ్ళడానికి పుస్తకాలు హాండ్‌బ్యాగ్‌లో సర్దుకుంటున్నారు. నామాటలు విని ఆశ్చర్యంగానన్నే చూస్తున్నారు.

"ఏం జరిగిందమ్మా. ముందు మీరు కూచోండి. - ఆ ఇప్పుడు చెప్పండి మీ ప్రాబ్లమేమిటో" అన్నారు హెడ్మాస్టరుగారు.

"బయటెవరో వ్యక్తి రెండు రోజుల్నించీ పిల్లలను కనిపెట్టి స్కూలు వదిలేసమయానికి కాచుకొని, పిల్లలకు చాక్లెట్లిచ్చి కిడ్నాప్ చేద్దామని ప్రయత్నం చేస్తున్నాడు. మీ స్కూలు కాంపౌండు కెదురుగానే జరుగుతున్నా మీరు పట్టించుకోరా" అన్నాను కొంచెం కోపంగానే.

"కిడ్నాపా, మా స్కూలు కెదురుగానా - ఎవరా పిల్లలకు చాక్లెట్లిచ్చే వ్యక్తి." అని లేచి బయటి కాంపౌండు దాకా వెళ్ళి ఇటూ అటూ చూచి మరలా వచ్చి సీట్లో కూర్చొని "బయట ఎవరూ లేరు గదమ్మా" అన్నాడు.

"ఆ గడ్డం మనిషి, అరవం కలిసిన తెలుగు మాట్లాడతాడు. అతనేనండీ మా పిల్లలకు రెండు రోజుల్నుంచీ చాక్లెట్లిచ్చి మాలిమి చేసుకోడం నేను చూశాను" అన్నాను.

"గడ్డం వున్న అరవమనిషా," అని ఓ నిముషం ఆగి "మురుగ నాయగం సంగతా మీరు చెప్పేది" అన్నాడు.

"మురుగనాయగమో, మురికి నాయగమో-వాడు వాడి పేరు తెలీదు - అతను మీకు తెలుసా" అన్నాను.

"మురుగనాయగం చాలా మంచి మనిషి" అంటూ ఇంకా చెప్పబోతుంటే నేను అసహనంగా మాట్లాడబోయాను.

"ముందు మీరు వినండి మేడం. మురుగ నాయగం నాకే కాదు. ఈ స్కూల్లో స్టాఫందరికీ తెలుసు. నాలుగేళ్ళక్రితం తమిళ నాడు నుంచి వచ్చాడు. ఈరోడ్డు చివర వున్న షాపులో పనిచేస్తాడు. ఇల్లు కూడా ఈ ప్రాంతం లోనే వుంది. భార్యా ఇద్దరు పిల్లలతో ఈ వూరొచ్చాడు. వాళ్ల పిల్లలిద్దర్నీ ఈ స్కూల్లోనే చేర్పించాడు. "హెడ్మాస్టరు చెపుతున్నాడు నేను ఓపిగ్గా వింటున్నాను. క్రమంగా నాకోపం గూడ తగ్గుతున్నది.

"మురుగనాయగం భార్య ముక్కుకు బేసరి పెట్టుకొని పెద్దబొట్టు, పైన సన్న విభూది గీతతో, అరవ సంస్కృతి వుట్టి పడుతూ కంచి కామాక్షి తాయిలాగా వుండేది. పిల్లలిద్దర్నీ ఆమే ప్రతి రోజూ స్కూలుకు తీసుకువచ్చి తిరిగి ఇంటికి తీసుకుపోయేది. అప్పుడప్పుడూ అతనూ వచ్చేవాడు. అతనిభార్య పుట్టిల్లూ, అతని సొంతవూరూ రెండూ నాగపట్టణం పక్కన ఏవో చిన్న టౌన్లు.

మొన్న పిల్లలకు శలవులిచ్చినప్పుడు పిల్లలనూ భార్యనూ తీసుకొని వాళ్ళ వూరు పోయినాడు. భార్యా పిల్లలను అక్కడే వదిలి తనకు శెలవు లేనందున తను వచ్చేశాడు. తర్వాత ఏంజరిగిందో తెలుసామ్మా. శ్రీలంకనూ, తమిళనాడూనూ భీభత్సం చేసిన మొన్నటి సునామీలో నాగపట్టణంమొత్తం కొట్టుకుపోయినప్పుడు మురుగనాయగం భార్యా ఇద్దరు పిల్లలూ, అత్తామామలూ, తల్లీ తండ్రీ-అందరూ చని పోయారు. ఆ సంగతెలిసి మురుగనాయగం కుప్పకూలిపోయాడు. అతన్ని సముదాయించ డానికి మాస్టాఫ్అంతా ఎంతో ప్రయత్నించాం. అతను మునుపటి హుషారు మురుగనాయగం కాదమ్మా ఇప్పుడు. కంచి కామాక్షిలా ఉండే ముచ్చటైన భార్యా, ముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలూ-తల్లీ తండ్రీ అందరూ ఒక్కసారే పోయి, నట్టనడి సముద్రంలో మునిగిపోబోతున్న ఒంటరి పడవలా-అతనింకా బ్రతుకుతున్నా డంటే ఆశ్చర్యమే. అతని పిల్లలిద్దరూ మీపిల్లలైన కిరణ్ సవితల్లాగే, అదే వయసులో వుండేవారు. ఇప్పుడతను షాపు వదలగానే ఇటు వచ్చి - స్కూల్లోంచి బయటికి వచ్చే చిన్నారులను కన్నార్పకుండా చూస్తూ, వాళ్లల్లో తన పిల్లలను చూసుకోవాలనే ప్రయత్నం చేస్తున్నాడు. రత్నం లాంటి మనిషమ్మా మురుగనాయగం." అంటూ "ఈ విషయం తెలిసినప్పుడు-ఇప్పుడు మీరు బాధపడుతున్నట్లే మా స్టాఫందరం దుఃఖించాం. కళ్ళు తుడుచుకోండి-ఏం చెయ్యగలం- పాపం దురదృష్టవంతుడు" అన్నారు హెడ్మాస్టరుగారు.

నా కళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి. నాకు గుండె పిండేసినట్లయింది. బయటికి వచ్చి పిల్లల్తో మాట్లాడుతున్న మురుగ నాయగాన్ని చూశాను. నా కంట్లో నీటి పొరవల్ల అతని ముఖం సరిగ్గా కనిపించలేదు. నాకు గుండెలోంచి దుఃఖం ఎగదన్నుకొని వస్తున్నది.

"చిన్నా, ఇంక వెళదాం. అంకుల్‌కు బై చెప్పండి" అని "మురుగనాయగం పిల్లలకు చాక్లెట్లివ్వవా" అని నాకళ్ల నీళ్ళు అతనికన్నపడకుండా ముఖం పక్కకు తిప్పుకున్నాను. అతని తడికండ్ల వెనక మెరిసిన చిన్న, చాలా చిన్న వెలుగు నాక్కనపడే అవకాశం లేదు.

# హైకూలు

**తల్లి** ఏడుపులో
ఆనంద భాష్పాలు
శిశువు పుట్టుకతో

ఇన్ని ఆశలు
అడి ఆశలే
విధి వద్ద

అంధులైన చూచారు
అద్భుత లోకం
కనులున్న మనస్సు

\- బొడ్డు గంగాభవాని